గౌరిలు

"ఉట్టిదా. సీతమ్మ దర్శనం చేసుకుపోగూడదా" అంది మా అత్తగారు.

నేను కొత్త పెళ్ళికొడుకుని. సెలవు ఇంకా వుంది. అయినా అత్త వాటాలో నెల రోజులుగా తిష్టవేసి తిని కూర్చోవడం నాకే సిగ్గేసి, సెలవు అయిపోయిందని బొంకి, వెళ్ళిపోదామని బయల్దేరుతుంటే — మా అత్తగారు ఈ ఒక్కరోజు ఆగమంటుంది. సీతమ్మ దర్శనం చేసుకొని మరీ పొమ్మంటుంది. మా ఆవిడ గూడా అంచుకు తందానాతానా అంది. సరే పుండిపోదానికేం?

ఇంతకీ ఎవరీ సీతమ్మ? ఆయమ్మ దర్శనం ప్రయాణమే వాయిదా వేయాల్సినంత గొప్పదా?

"సీతమ్మ ఎవరండీ? బంధువులా? స్నేహితులా?"

నేనా ప్రశ్న చాలా అజ్ఞానంతో అడిగినట్టుగా నావైపు చూసేరు అత్తగారు.

"ఛలే వాడివే అల్లుడూ. సీతమ్మంటే మనలాంటి మనిషి అనుకున్నావేంటి? కాదు. దేవత, సాక్షాత్తు ఆ శ్రీరామచంద్రమూర్తి ఇల్లాలే అ తల్లి" అంటూనే ఆ తల్లి తలపుకి పులకించిపోయి ఓసారి చేతులు జోడించేయడం కానిచ్చేరు.

నాకు ఆశ్చర్యం వేసింది. సీతమ్మంటే సీతాదేవా? పోనీ సీతాదేవే అయినప్పటికీ రామున్ణి 'ఓవర్‌లుక్' చేసి ప్రత్యేకంగా సీతమ్మంటూ

మాటాడ్డం ఇదే వినడం. ఎక్కడైనా రామాలయాలు వున్నాయిగాని సీతాలయాలు లేవుగా ?

కానిక్కడ సీతాలయం వుందన్నారు - అడగ్గా. చిత్రమే.

మనం ఎక్కడికెళ్ళినా శ్రీరాముడి గ్రూప్ ఫోటో చూస్తుంటాం. రాముని కిరువైపుల సీతా, లక్ష్మణులు, పాదాల చెంత ఆంజనేయులతో - అయితే మనవాళ్ళు ఆరాధించేది రాముణ్ణి. రామభక్త హనుమాన్‌ని (హనుమంతునికి సపరేట్‌గా కూడా ఆలయాలున్నాయి). కాని వారిద్దరిలా సీతాదేవి, లక్ష్మణుడు భక్తులను ఆకర్షించలేకపోయేరు. ఆకట్టుకోలేకపోయేరు - అని అనుకున్నా నా అభిప్రాయం ఇక్కడ తలకిందులయింది.

అయితే ఆ సీతాలయం ఏమిటో చూసితీరాల్సిందే.

నేను, మా ఆవిడ ఆలయానికి బయల్దేరాం.

సీతమ్మ దర్శనం శనివారం మాత్రమే లభిస్తుందట. అయితే ఆ రోజు శనివారం కాదు. కాకపోయినా మాకు దర్శనం లభిస్తుందంటే - మరేం లేదు, మా మావగారు ఆ వూరికి ప్రెసిడెంటు, పెద్ద మనిషిని. ఆ గుడి వారి అండర్‌లోనే వుందట. ఇక చెప్పేదేముంది ?

గుడిలోకెళ్ళి నేను స్తన్నాయిపోయేను. ఆ దేవత రాయీ కాదు, రప్పా కాదు. ప్రతిమా కాదు, పటమూ కాదు. ఆమె సజీవంగా ప్రాణం పోసిన శిల్పంలా వుంది. శ్రీరామచంద్రుడు మటుకు బొమ్మ రూపంలోనే ఆమె చేతిలో వున్నారు. కాని సీత బతికే వుంది.

సీత బతికి వుండడమేమిటి ? ఇదేదో వింతగా వుందే.

వివరాలు అడిగేను మా ఆవిణ్ణి.

మా ఆవిడ చెప్పాలని ప్రయత్నించి చెప్పలేక 'నాకన్నా మా అమ్మ సీతమ్మ తల్లి చరిత్ర బాగా చెబుతుంది' అని మాత్రం చెప్పింది.

భోజనాలయ్యేక, తిరిగ్గా కూర్చున్నాక మా అత్త సీతమ్మ కథ పూసగుచ్చినట్టు చెప్పింది. అంతా కళ్ళతోనే చూసినట్టు చెప్పింది. చెప్పిందేవిటంటే -

ఇరవయ్యేళ్ళ కిందట సీతాదేవి మళ్ళీ జన్మనెత్తిందట ! అదీ ఈ వూళ్ళోనేనట ! చిత్రమేవిటంటే సీతమ్మ పుట్టగానే 'క్వా, క్వా' అని

పడ్వలేదట. 'రా, రా' (రామా, రామా) అని ఏడ్చిందట. అమ్మానాన్నలంతా ముగ్గుమీద వేలేసుకున్నారట. పాకే వయసులో గిచ్చి కాయనిచ్చినా, కోతి బొమ్మనిచ్చినా పుచ్చుకునేది కాదట. ఏదిచ్చినా కావని, కాలదన్ని బయటపడేసి, బంగురుకొని దేవుడి మూలకెళ్ళి రాముల వారి బొమ్మ తీసుకుందట. ఆ చోద్యం చూసి, ఆ పసి వయసులో ఆ పిల్లకి మాత్రం (ఈ సారి ముగ్గుమీద కాకుండా) ముక్కులమీద వేళ్ళేసుకున్నారట. రాములవారి బొమ్మను బలాత్కారంగా లాగేసుకుంటే పెద్దగా ఏడ్చి పెట్టేసేదట. ఆ బొమ్మను తిరిగిస్తేనేగాని వూర్కొనేది కాదట. ఇలాంటి ప్రేమలు, పెళ్ళిలూ సీతమ్మ తరచుగా చేసుండడం వల్ల ఆడోళ్ళ ముక్కులమీద వేళ్ళు ముక్కులయ్యే అలా వుండిపోయేవట. (అప్పుడేనట ఒకసారి మా అత్త అటు అవసలో వుండగా మగోడెవడో మెడ మీద బయ్యారి మెళ్ళోతాడు ఎత్తుకుపోయేడట) ఆ పిల్ల ఆ బొమ్మతోనే ఆడుకునేదిగాని తోటి పిల్లలో ఆడుకొనేది కాదట. అంచేత ఆ పిల్ల పేరు సీతమ్మగా మార్చేరట. (మార్చక ముందు ఆ పిల్లపేరు ఏవిటి పెట్టారో ఆ పిల్లతల్లే మర్చిందట!) ఓ నాడు లవకుశ 'బైసుకొప్పు'కి సీతమ్మ అయిదో యేట తన అమ్మతో వెళ్ళిందట. వెళ్ళి సినిమాలో తెగ పేచీ పెట్టిందట. 'నా రాములవారి దగ్గరకు పోతానని' తెర దగ్గరకు పోడానికి తెగ గింజుకుందట. తెగ ఏడ్చిందట. సినిమానుంచి వచ్చేక కూడా ఏడ్పే నట. పిల్లమీద గాలి వాలిందేమోనని మంత్రాలు వేయించిందట! చింత కాయలు రాల్తేదట. చివరికి తల్లి విసిగిపోయి, వేసారిపోయి వూరుకుందట. ఎంత వూరుకున్నా సీతమ్మ పేటలు వేసే కాలం రాగానే ఇక వూర్కోక లేక పెళ్ళి ప్రయత్నాలు చేసిందట పుత్తడి బొమ్మలాగ, పటికబెల్లంలా గున్న సీతమ్మను ఎవడు చేసుకోడు? చేసుకోడానికి చాలామంది ముందు కొచ్చేరట. కాని ఒకడు పెళ్ళి చూపుల్లోను, మరొకడు పెళ్ళి పీటలమీద 'హరే' అన్నారట. దాంతో ముందుకొచ్చిన పెళ్ళికొడుకులంతా వెనక్కి దాపు తీసేరట. ఇంకేం పెళ్ళి ప్రయత్నాలు? తల్లి మళ్ళీ వూరుకుండి పోయింది. సీతమ్మకిక తిండీ, నిద్రా, సర్వం, సమస్తం ఆ రాములవారి బొమ్మేనట. ఆ బొమ్మను ఒక్క క్షణం వదలదట.

సీతమ్మ చల్లని వెన్నెల కిరణాలతోనూ, పాలసముద్రంకెరటాల తోనూ చేసినట్టు అద్భుతంగా, సర్వాంగ సుందరంగా వుంటుందట—'అట' ఏంటీ? నిజంగానే వుంటుంది. నే చూశాగా.

ఇంకా సీతమ్మ గురించి చెప్పింది.....

ఇలా వుండగా ఓ రోజు తెల్లారిజాముని సీతమ్మ కనబడ్డం మానేసిందట. అంతా రెండు, మూడు రోజులు వెతికేరట. అన్ని వూళ్ళూ వెతికేరట. అన్ని ఇళ్ళూ గాలించేరట. అన్ని నూతులు చూసేరట. అన్ని చెరువులూ చూశేరట చుట్టుప్రక్కలున్న రామాలయాలన్నిటి దగ్గర వెదికేరట. ఎక్కడా కనిపించలేదు. కనిపించకపోగానే కొంతమంది చుప్పనాతి సూరమ్మలు అన్నారట 'నంగనాచిలాగుండి ఎవడితోనో లేచిపోయిందని!' మొత్తానికి చచ్చిపోయిందనో, లేచిపోయిందనో అనేసుకొని వూరుకున్నారట.

అంతలో ఒకడు సీతమ్మ-తల్లి దగ్గరకు పరుగు పరుగున వచ్చి సీతమ్మ ఎక్కడుందో 'ఇన్‌ఫర్‌మేషన్' ఇచ్చేడట. వాడి వెంట సీతమ్మ తల్లీ, చుట్టుప్రక్కల వాళ్ళూ వెళ్ళేరట. వూరు ప్రక్కనున్న కొండల్లోకి వెళ్ళేరట. కొండల మధ్యనున్న పెద్దలోయలోకి వెళ్ళేరట. లోయల్లో చెట్లనూ, పుట్లనూ, రాళ్ళూ రప్పలనూ తప్పుకుంటూ, తన్నుకుంటూ వెళ్ళేరట. వెళ్ళి అక్కడ సీతమ్మను చూశేరట. సీతమ్మ చెట్టుకింద కూర్చొని రాములవారి బొమ్మతో ఆడుకుంటుందట. ఇంటికిరమ్మంటే రానని సీతమ్మ అడ్డంగా తల ఆడించిందట. చిర్రెత్తుకొచ్చి బలాత్కారంగా ఎత్తుకుని ఇంట్లో పడేశారట. గదిలో పెట్టి గెడవేసి, ఇప్పుడెలా తప్పించుకు పారిపోతుంది?' అన్నారట. కాని సీతమ్మ తప్పించుకు పారిపోయిందట. తిండి పెడదామని తల్లి తలుపు తీసి చూస్తే గదిలో సీతమ్మలేదట. మట్టిగోడకి మనిషి దూరేపాటి కన్నం, ప్రక్కన గునపం వున్నాయట గదిలో.

ఆ రాత్రే చప్పుడు చేయకుండా ఆ కొండల్లోకే ఆ లోయలోకే పోయిందట. అలాంటిచోట ఆడదొక్కతే రాత్రులుండ్లో గణుగుతుందంటే సామాన్యమైన విషయమా? ఈసారి వూరంతా కలసి ఆశ్చర్యంతోను, చిరాకుగాను, కోపంగాను కదిలి వెళ్ళేరట. చూశేరుగదా, చిరాకూ కోపం చెరొకిక్క

పోయేయట.ఆశ్చర్యం అత్యంత ఆశ్చర్యంలోకిమారిందట.చూసిన దృశ్యం చిత్రాతి చిత్రమట.

అప్పుడే ప్రొద్దుపొడుస్తున్నట్టు తెలతెల్లగా తెల్లవారుతోందట. ఆకాశం ఎర్రపిడాన్ని ప్రసవించినట్టు సూర్యుడు కొండలమీంచి నెమ్మది నెమ్మదిగా లేచి వస్తున్నాడట. చెట్లన్నీ తడిసిన వస్త్రాల్లోనున్న తరుణుల్లా మంచులో తడిసిపున్నాయట. లోయలోకి కిరణాలు బంగారు గొట్టాలు గుచ్చినట్టు కానవస్తున్నాయట. ఆ లోయలో కల్పవృక్షంలా, చల్లని నాత్మిపా క్రింద ఒక మర్రిచెట్టు వుందట. ఆ చెట్టుక్రింద ఎండుటాకుల పరుపులమీద తెల్లచీరలో సీతమ్మ వెల్లికిలా పడుకొని వుందట. దేవలోకం నుంచి కిందకు వచ్చి తిరిగి దేవలోకం వెళ్ళడానికిష్టంలేక వుండిపోయిన దేవతలా వుందట. ఆమె గుండెలమీద రాములవారి బొమ్మ వుందట. సీతమ్మ మంచుపొగలో, పసుపు బంగారు వెలుగులో బంగారపు బొమ్మలా వుందట. అందర్నీ గుండె ఆగేటంత ఆశ్చర్య పరచిందేవిటంటే ఒక పెద్ద నాగుపాము సీతమ్మ తలమీద పడగెత్తి కిరణాలసూదులు సీతమ్మ ముఖాన్ని గుచ్చకుండా నీడ నిస్తోందట. సీతమ్మ వున్న చోటంతా అదొక రకమైన దివ్యాతిదివ్యమైన తేజస్సుతోనూ, సుగంధభరితమైన పరిమళము తోనూ నిండిపోయిందట. అందరూ సీతమ్మ ముఖంలో కళాకాంతుల్ని చూడలేక పోయేరట.

'అమ్మా, తల్లీ, నీవు నిజంగా ముమ్మూర్తులా సీతాదేవివే తల్లీ. ప్రతాపచంద్రుల సతీమణివేతల్లీ' అని లెంపలు వాయించుకొని, సాగిలబడి సాష్టాంగ దండ ప్రమాణాలు ఆచరించేరట. దండాలు పెట్టగానే నాగరాజు 'ఇక ఈ దేవత బాధ్యత మీరు తీసుకోండి' అన్నట్టుగా తలదించి చల్లగా కొండల్లోకి జారుకుంటూ వెళ్ళిపోయేడట.

ఇక దాంతో పూర్తంతా సీతమ్మను దేవతగా గుర్తించేసేరట. బంగ్లాదేశ్ ప్రక్రమక్రమేపి అన్ని దేశాలు గుర్తించినట్టు అన్నివూళ్ళూ సీతమ్మను దేవతగా గుర్తించేయట. 'గుర్తించను, గుర్తించను' అంటూ చివరికి చచ్చేటట్టు గుర్తించిన పాకిస్తాన్‌లా గవర్నమెంటు కూడా సీతమ్మను గుర్తించిందట!

మా మావయ్య ముందుకువచ్చి గుడికట్టాలనే సదుద్దేశంతో, అచంచల దీక్షతో నిలబడి చందాలు వసూలుచేసి, శ్రమపడి గుడి కట్టించేడట. దేవాదాయ కమిటీకి అప్పటినుంచి మా మావయ్యగారే ప్రెసిడెంటట, ధర్మకర్తట.

సీతమ్మ పాలుమాత్రమే ప్రాగుతుందట పళ్ళు మాత్రమే తింటుందట. ఆమెకు ప్రతిరోజూ పూజట. రోజూ ఉదయం పాలతో స్నానం చేయిస్తారట. ఎప్పుడూ తెల్లటి చీరే కడతారట. తలంబేక జడవేసుకోడానికి ఒప్పుకోదట. అంచేత ఆమె జుత్తు నల్లనిమేఘ శకలాలవలె ఆమెను ఆక్రమిస్తుంది. జుత్తు ఒత్తుగానే కాకుండా ఇంచుమించు నేలకు తాకేటంత పొడవు! స్నానం చేయించి ప్రత్యేకంగా ఆ జుత్తుకి సాంబ్రాణి పొగ పెడతారట. ఇదంతా ఆమె తల్లే స్వయంసేవగా చేస్తుందట.

సీతమ్మ గుడిపద్ద ప్రతి ఏడాది సీతారామకళ్యాణ మహోత్సవం తొమ్మిది దినాలపాటు బ్రహ్మాండంగా చేసారట. మిగతా దినాల్లో ప్రతి శనివారం ఆమె దర్శనభాగ్యం లభిస్తుందట. ప్రతి శనివారం అక్కడ పెద్ద తీర్థంలా వుంటుందట- భక్తులు చుట్టుప్రక్కల గ్రామాలనుంచేకాక ఎక్కడెక్కడనుంచో వస్తూంటారట (ఆ దేవతను దర్శించిన వారిలో ఆంధ్ర మంత్రులిద్దరూ, కేంద్రమంత్రి ఒక్కరూ వున్నారట.) కారులు, యాత్రా స్పెషల్ బస్సులు వస్తుంటాయట.

సీతమ్మ తన భక్తుల్ని కన్నెత్తి చూడదట; పన్నెత్తి మాటాడదట. అసలు ఎవరితోనూ మాటాడదట. అయితే ఆమె భక్తుల్ని తిలకించక పోయినా, పలకరించకపోయినా దర్శనం చేసుకుంటే చాలు. భక్తుల బతుకులు ధన్యమవుతాయట. ఆ దేవతను ఏం కావాలని మొక్కితే అది దక్కుతుందట. పిల్లల్లేని వాళ్ళకు పిల్లలు పుడుతున్నారట. పెళ్ళిళ్ళు కాని వాళ్ళకు పెళ్ళిళ్ళయిపోతున్నాయట. జబ్బులున్న వాళ్ళకు జబ్బులు పోతున్నాయట.డబ్బులేని వాళ్ళకు వద్దంటే డబ్బు వస్తోందట. మొక్కులు ఆవిధంగా నెరవేరుతుండడంచేత రోజురోజుకి భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగి చందాలు, ముడుపులు వగైరా రూపంలో విపరీతంగా డబ్బు వస్తోందట కనకవర్షం కురుస్తోందట. వస్తోన్న డబ్బు కురుస్తున్న కనకం

మటుకు మా మావ పెళ్ళిలోకి వెళ్తోందట. (అలా వెళ్తుందనడం కిట్టని వాళ్ళు అన్నమాటలట—నేను నమ్మామంది మా అత్త)

అదీ మా అత్త చెప్పిన సీతమ్మ దేవత కథ.

ఈ 'అట్టా, అట్టా' కథ ఎంతవర్కూ కరక్టనేది నాకు తెలీదు. అయితే ఇటువంటి చిత్రమైన కథలు మన ఆధ్యాత్మిక దేశానికి కొత్తవి కావు. ఇటీవల ఊరుకొక దేవుడూ వాడకో దేవతా మనకు పుట్టుకొస్తూనే వున్నారు. వారికి పబ్లిసిటీ, ప్రాపగాండా మా మావలాంటి వాళ్ళేకాదు—మహామహా మేధావులే చేస్తూ నెత్తిన ఎత్తుకు ఊరేగుతున్నారు. ఏమాట కామాట—అందుకు ఒప్పుకోవాలి. మనం— ఏమంటే దేశంలో ప్రతిదీ కుళ్ళు. ఏదీ సరసమైన ధరకు దొరకడంలేదు. ధరలు ఆకాశంలో చుక్కలతో ఆడుకుంటున్నాయి. వాటిని పిలక పట్టుకుని ఈడ్చుకు వద్దామంటే—వంట్రుణ్ణి చేరలేకపోతున్న మనం అసలు చుక్కల్ని చేరలేం. అంచేత 'ప్రయ్యో ! ఏందారి భగవంతుడా' అని క్షోభించే ఆత్మలకు చవగ్గా, అతి తక్కువ ధరకు ఆధ్యాత్మిక చింతన కల్గించడం, తద్వారా మనశ్శాంతి కల్గించి జోకొట్టడం వీళ్ళ పరమ ధ్యేయం. యువతరం నిరాశ, నిస్పృహల నుంచి వీరావేశంలోకి జారి తిరుగుబాటు చేసే ప్రమాదం రానీయకుండా 'నాయనా ఇదంతా దైవలీలరా, వర్గపోరాటాలంటూ కొట్టుమిట్టాడకురా వీర వెర్రివాడా. ప్రపంచమంతా శూన్యం. రాజూ-బానిస, భూస్వామీ-పాలేరు, యజమానీ-కార్మికుడు..... ఇదంతా మిథ్య. భ్రమ. నీ అజ్ఞానం తప్ప మరేమీకాదు. వాస్తవం ఒక్క దేవుడే. వాడినే అందుకో. చేరుకో' అంటూ జీవాత్మ, పరమాత్మల రిలేషన్ను ప్రబోధించడమే వీళ్ళ పరమ లక్ష్యాలు. దేశంలో పాపాన్ని, విప్లవాన్ని అణిచి పుణ్యాన్ని, దైవాన్ని నిలబెట్టడమే ఈ మావయ్యలాంటివాళ్ళ ఆరాటం—అనిపించింది నాకు.

అంతేకాకుండా మా మావయ్య భూములతోనూ, బంగారంతోనూ పచ్చ పచ్చగా విరాజిల్లుతుండడం ఆ దైవకృప వల్లేనని, ఆ సీతమ్మ దేవత చలవేనని కూడా అనిపించింది నాకు.

ఏమంటే ఈ ఇరవయ్యో శతాబ్దంలో, మనిషి మార్క్సిస్టుగా మారిపోతున్న మాయదారి రోజుల్లో— దేవుణ్ణి నిలబెడుతున్న వారిని,

నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్న వారిని దేవుడెలా అన్యాయం చేయగలడు వారిని తను నిలబెడతాడు. అది తన ధర్మం.

ధర్మప్రకారంగా మా మావయ్య నిలబడ్డాడు!

* * *

నాలుగేళ్ళ గడిచేయి.

మా అత్తగారు పెజారో వచ్చేరు. రావడం కూతుర్ని చూసిపోడా మని కాదు. మోసుకుపోడానికి. విశేషమేమిటంటే మా ఆవిడ మరో ప్రాణిని ఏడు నెలలుగా మోస్తోంది.

పట్నంకదా, డెలివరీ ఇక్కడైతేనే బాగుంటుందని వేను అంటున్నా, లేదు తొలి కాన్పు తప్పనిసరిగా మా దగ్గరే జరగాలంటూ తప్పనిసరిగా తీసుకుపోవడానికొచ్చేరు.

అసలు మా అత్తగారి వుద్దేశంలో కూతురికాపాటికి నాలుగేళ్ళలో ముగ్గురు పిల్లల్ని కనేసి వుండాలని. అంచేత పెళ్ళయి మూడేళ్ళదాటినా కూతురు ఇంకా నీళ్ళు పోసుకోకపోవడంతో కూతురు తల్లిగారు చెడ్డ గాభరా చెందేరు. నిజం చెప్పొద్దూ—నాకూ అనుమానమే వేసింది. పిల్లలు కలగరేమోనని.

ఏమంటే ఈ రోజుల్లో పెళ్ళి కాగానే ఆడపిల్ల 'మెన్సెస్' మిస్సవడం మామూలు. పిల్లడికి బారసాల తర్వాతనే 'పెళ్ళిరోజు' చేసుకుంటున్న రోజులివి. అటువంటిది పెళ్ళయి 50 నెలలు దాటినా మా ఆవిడ నెల తప్పకపోవడంతో మా ఇంట్లోనూ, మా అత్తవారింట్లోనూ భయాందోళనలు ప్రారంభమయ్యాయి.

ఇద్దరం స్పెషలిస్టు దగ్గరికెళ్ళి చెక్ చేయించుకున్నాం. మందులూ. మాకులూ తిన్నాం. మా శ్రీమతికి మైనర్ ఆపరేషన్ కూడా చేశారు. (ఏమైతేనేం) ఆపరేషన్ చేశాక మా శ్రీమతికి నెల తప్పింది. నేనలా గన్నాయికు మా అత్తగారు పెద్ద గొడవపెట్టి ఒప్పుకోలేదు. కడుపు రావడానికి కారణం నేనుగాని, ఆపరేషనుగాని కాదన్నట్టు మాటాడిందావిడ. అదంతా సీతమ్మ తల్లి అనుగ్రహం అంది. అప్పుడే మా అత్త మొక్కు

కుందట. 'నా తల్లి గర్భం ధరిస్తే చీరా రవికా పెడతానని. 116 కొబ్బరి కాయలు కొడతానని '

ఇప్పుడు సీతమ్మకు చీర, రవికా పెట్టేసి, కొబ్బరికాయలన్నీ కొట్టేసి మరీ కూతుర్ని తీసుకెళ్ళాడని కొచ్చింది కాబోలు.

"అత్తగారూ, కొబ్బరికాయలన్నీ మీరే కొట్టారా? మావయ్య గారు కూడా సాయం చేశారా?" —అడిగేను భోజనాలయ్యేక, తీరిగ్గా కూర్చొని.

సీతమ్మ టాపిక్ ఆ విధంగా ఎత్తడంతో మా అత్త ముఖం వివర్ణమైపోయింది. కళ్ళు ఎర్రబడ్డాయి. ఆమెను చూస్తే కొంపదీసి సీతమ్మగారిని ప్రశ్నలేమగదా అనిపించింది.

మా ఆవిడ, నేను ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం.

అంతలో ఆమె గట్టిగా అరవడం మొదలెట్టింది.

"అది, ఆ పుండ దేవతకాదు. పాడూకాదు. దయ్యం. కామ పిశాచి. దానికిష్టుడు అభిషేకం కొబ్బరికాయల్తో కాదు, రాళ్ళూ, రప్పల్తో చేస్తున్నారంతా...."

పిడుగులాంటి వార్తకి నేను మా ఆవిడ మరోసారి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం. అత్తయ్య అంటున్నదేమిటి? సీతమ్మ గురించే? 'అవును, అదే. ఆ రంకుపుండనే' అని ఖరారు చేసింది మా అత్త. దాన్ని కాకపోతే ఇంకెవర్ని తిడతానన్నట్టు!

"ఎందుకలా తిడుతున్నావే, తప్పు కదా" – చేయితను పట్టుకొని తల్లి దుర్భాషలాడ్డం కూతురు భరించలేక భయంగా, గాభరాగా అడిగింది.

"తప్పా? అవును తప్పేనే దానిని ఇన్నాళ్ళూ గుడ్డిగా, గుడిలో పెట్టి పూజించడం తప్పే. ఆ పుండ పాదాలు ఎన్ని నెత్తిన పెట్టుకోవడం తప్పు కాకిపోతే ఏంటి?....ఆ పుండ ఏంటో అనుకుందిగాని పైన దేవుడు – అసలు పిసలు భగవంతుడుండగా మాయలూ, మోసాలూ ఎన్నాళ్ళు సాగుతాయి! రంకులూ, బొంకులూ ఎన్నేళ్ళు దాగుతాయి?"

"ఇంతకీ ఏమయ్యిందో వివరంగా చెప్పవే అమ్మా."

"చెప్పడానికేముండే, ఆ సీతమ్మిండకి కడుపే. ఎనిమిదో నెలో, తొమ్మిదో నెలోనే తల్లీ. ఇంకేం చెప్పమంటావే ఆ లాజ గురించి...."

సీతమ్మకి కడుపా!?

మా ఆవిడ కళ్ళు తిరిగి కింద పడబోతుంటే గభాల్న పట్టుకొని మంచంపై వేశాను.

మరుసటి రోజు అత్తగారు ఆవిణ్ణి వూరు తీసుకెళ్ళిపోయేరు - పురుడికి.

నా కళ్ళకింకా సీతమ్మ ముఖం కనిపిస్తూనే వుంది. అత్త అన్న మాటలు నా చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే వున్నాయి.

నిన్నటిదాక దేవత అన్న జనం ఈ రోజు దెయ్యం అంటున్నారు.

నేనే దేవుణ్ణి, లేక కారణజన్ముణ్ణి అని చెప్పుకొని సేవలు చేయించుకొనే బాబాలు, అమ్మల గుట్టు ఎప్పుడో ఒకనాడు బట్టబయలు కాక తప్పదు. కాని సీతమ్మ కేసు వేరు. తను బాబాల్లాగ, అమ్మల్లాగా 'నేనే దేవతనీ, శక్తినీ, సీతనీ' అని చెప్పుకోలేదు. ఆమె మామూలు మనిషి కాదు. దేవత, శక్తి, సీత అనిపించేలా చేశారు. ఎవరు చేసింది? ఇంకెవరు? మా మావయ్య, అతని కూటమి. తన జుత్తులో మోక్షానికి చిట్కాలున్నాయని ఆమె అనలేదు. వింత వింత గారడీలు చేయలేదు. ఆమె పిచ్చిదో, జడ్డిదో అయుండాలి. ఆమె పిచ్చిని, అమాయకత్వాన్ని వుపయోగించుకొని ఆమెను సీతగా నిలబెట్టేరు. చందాలు, వుడుపులంటూ డబ్బు చేసుకున్నారు.

ఇంకా నాకేమి అనిపించిందంటే—

ఆమె దేవత కాదని, దేవతగా సృష్టించబడ్డానని తెల్సుగాబట్టి ఆమె అందానికి, వయసుకి పిచ్చెక్కి, పిచ్చిగా తాగొచ్చి మా మావయ్య ఆ పిచ్చి సీతమ్మకి కడుపు చేసుండినా చేసుండొచ్చు. అందుకు అవకాశముంది గాబట్టి ఆశ్చర్యపోనక్కర్లేదు కూడా.

జనం ఆమెను బతకనియ్యరేమోనని, ఎవరికంటా పడకుండా ఆమెను ఆమె తల్లి లడఖ్‌లో ఒక మూలకి తీసుకుపోయి కాపాడుకుంటుం దట. ఎంతయినా తల్లి తల్లే. కూతురు దేవతైనా, దయ్యమైనా, పుండ యినా, పుష్టిపైనా మాతృప్రేమ మారదు. తరగదు. ఆ ప్రేమకంత బంధ మెుండి, బలమెుండి.

* * * *

మా శ్రీమతి పురుడికెళ్ళి మూడునెలలు కావస్తున్నా ఒక వుత్తరం లేదు పత్రంలేదు - మొదట్లో క్రమంగా దిగామన్న ఒక్క కార్డుముక్క తప్పించి. వచ్చిన చిక్కు ఏమిటంటే ఉత్తరాలురాసే అలవాటు నాకూ లేదు. ఆ కార్డుముక్కకి రిప్లయ్ కూడా రాయలేదు ఇంతవరకూ, అంత బద్ధకం నాకు.

ఇంతకూ శ్రీమతిగారు ఎలా వున్నారో ఏమిటో—ఈసారి మచ్చ తంగా బద్ధకించకుండా ఉత్తరం రాయాలని టేబుల్ దగ్గర యిలా కూర్చున్నానో లేదో 'సార్ టెలిగ్రాం' అన్న కేకకి గుండెలదిరేయి. పరిగెత్తేను, ఎర్రకాగితంలో డేంజరులేదు. ఇలా వుంది 'కూతురు. తల్లీ, పిల్లా క్షేమం.'

ఇక నాలో ఆపుకోలేని ఆనందం. గుండెల్లో పట్టలేని సంతోషం.

కేలపు పెట్టి బియలుదేరాను.

తల్లీ పిల్లను చూసి కేలవై పోవడంతో తిరిగి ప్రయాణ మవు తుంటే—

"అల్లుడూ, ఈ రోజు శనివారం. సీతమ్మ దర్శనం చేసుకుపో గూడదూ" అంది అత్త!

నేను నిర్ఘాంతపోయాను. నీరసం వచ్చేసి కుర్చీలో కూలబడి పోయేను.

మా అత్తకిగాని మతిపోలేదుగదా. ఏమిటి మాటాడుతోంది ?

"అదేమిటత్తా ! మొన్నంటే, మొన్న సీతమ్మ చెడిన ఆడదన్నావు. తిట్టేవు. మళ్ళీ ఇపుడు !...."

మా అత్త మధ్యలోనే అందుకొని 'అపచారం, అపచారం' అని లెంపలు వేసుకొని "అవును బాబు. అప్పుడు కూసింది తప్పే. ఆ తల్లి మహిమ తెలీక నేనే కాదు, అంతా అలాగే అజ్ఞానంగా నిందించేరు మేమంతా ఆ తల్లికి క్షమాపణలు చెప్పుకున్నాం. దయగల తల్లి మమ్మల్నందరిన్ని క్షమించేసింది" అంది.

"ఇంతలోనే ఏమిటంటే మీరు తెల్సుకున్న ఆ తల్లి మహిమ ?" చిరాగ్గా అడిగేను.

"సీతమ్మ తల్లి లవకుశుల్ని ప్రసవించింది బాబు."

"అవునండి లవకుశుల్ని ప్రసవించింది. మీకు చెప్దామనుకొనే మర్చిపోయా" అంది మా శ్రీమతి.

నా బుర్ర గిర్రున తిరిగింది :